కథానిక

# ఆమె త్యాగం

గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

సూర్యభగవానుడి బంగారు కిరణాలు పడి ష్వే-డ-గాన్ పెగోడా ధగధగా మెరుస్తున్నది. రోనిన్ మహాశయుడు క్వాన్‌తా వరండాలో కూచుని ఆ శోభను తిలకిస్తున్నాడు. ఆ బుద్ధ భగవానుడి విగ్రహం, ఆ బౌద్ధ మతస్థుల భక్తీ, అవన్నీ చూస్తూ ఉంటే ఏ హిందువుడు మెచ్చుకోకుండా ఊరుకోగలడు?

"ఈ ష్వే-డ-గాన్ పెగోడాను చూశావా ఎంత అందంగా ఉందో?" ప్రశంసాపూర్వకంగా ప్రశ్నించాడు రోనిన్.

"చూడకేం? ఇవన్నీ నేను పదేళ్లనుంచీ చూస్తున్నవే!" అన్నాడు క్వాన్‌తా. అతని కళ్ళల్లో గతించిన దశాబ్దం మెదిలింది. తూర్పు దిక్కు కిటికీ చువ్వల్లోంచీ పడే సూర్యరశ్మి ఎరుపు ములుకుల లేత వెలుగులో అతని జ్ఞాపకాలు జ్ఞాపకాలా?

ఇంతలోకీ క్వాన్‌తా వెనకాల చిన్న చప్పుడు వినిపించి జ్ఞాపక వాహినికి అంతరాయం కలిగించింది. మాఖిన్ ఒక ట్రేలో "మొహింగా" తీసుకొచ్చింది. మాఖిన్ చేసిన "మొహింగా" అంటే క్వాన్‌తాకు భలే ఇష్టం. వాళ్ళమ్మ చిన్నప్పుడు అచ్చం అలాగే చేసేది చేపలూ, రకరకాల కూరగాయలూ వేసి!

తరువాత క్వాన్‌తా ఏదో వ్యవహారం చక్కబెట్టుకోటానికి బయటికి వెళ్ళాడు. అతని పిల్లలిద్దరూ పొరుగింటికి ఆడుకోను వెళ్ళారు. అతని భార్యమాత్రం లుంగీకి ఎంబ్రాయిడరీ కుడుతున్నది.

రోనిన్ క్వాన్‌తా మహాశయుడి తోటలో రెండు మామిడి చెట్ల మధ్య యొందుటాకుల శయ్యమీద నడుం వాల్చాడు. నిజానికి, బర్మాలో ఎన్ని కళా ఖండలున్నాయి? తను ఇదివరకు కర్ణాకర్ణిగా విన్నాడు. బర్మా పత్రికల్లో చదివాడు. అంతేగానీ, అతనికి వివరాలన్నీ వైనంగా తెలీవు. ఒక దేశ కళా సంపదను నోటిమాటల ద్వారాగానీ, పత్రికల ద్వారాగానీ సమగ్రంగా అవగాహన చేసుకోలేం.

అవతల కొళాయి శబ్దం అయింది. మాఖిన్ కొళాయిదగ్గర చేతులు కడుక్కుంటూ ఉన్నది. రోనిన్ ఆమెను చూసి, "ఇటుర"మ్మని పిలిచాడు.

మాఖిన్ వొచ్చింది, లుంగీతో చేతులు తుడుచుకుంటూ.

రోనిన్ అన్నాడు: "మాఖిన్ నువ్విక్కడ కూచో. నువ్వు ఎక్కణ్ణించి వొచ్చావో, ఎన్నాళ్ళనుంచి ఇక్కడున్నావో, మీ దేశం విశేషాలేమిటో అన్నీ విశదంగా చెప్తావా?"

"థాకిన్, నా పుట్టుపూర్వోత్తరాల వల్ల మీకేం లాభం?" అన్నది మాఖిన్.

"లాభం ఉండనీ లేకపోనీ. ఊరికే తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది" అన్నాడు రోనిన్.

"సరే. థాకిన్ ఒక కథ చెబుతాను" అంటూ ఒక చుట్ట నోట్లో ఇరికించుకుని, గుప్పు గుప్పుమని పొగవొదుల్తూ, కథ ప్రారంభించింది.

"మా ఊరు ఒక చిన్న గ్రామం. మాకు ఆరోజుల్లో కూటికీ, గుడ్డకూ లోటే ఉండేది కాదు. పాడిపంటలు సమృద్ధిగా ఉండేవి. అయినా మా గ్రామస్థులకు వ్యాపారం చెయ్యటం, లాభాలు సంపాదించటం అప్పట్లో తెలీదు.

"కానీ, పోనుపోను వ్యాపారం ప్రారంభించి, డబ్బు సంపాదించటం నేర్చుకున్నారు. మావూళ్ళో అటుతరువాత అందరూ వర్తకులే. లాభాలు సంపాదించి ఇనప్పెట్టెలన్నీ నింపేశారు. స్త్రీలను ఆభరణాలతో దిగేశారు. ఇళ్ళూ, వాకిళ్ళూ పెద్దవిగా కొత్తవిగా అందమైనవిగా కట్టారు.

"మా ఊళ్ళో అదివరకు ఎన్నడూ దొంగతనం అన్నమాట జరిగి ఎఱగను. మా ఊళ్ళో ధనధాన్యాలు నిలవ ఉంటున్నాయనీ, అందరూ వర్తకంలో తెగసంపాదిస్తున్నారనీ తెలుసుకుని, బందిపోటు దొంగలు వొచ్చి దోచుకుపోవటం మొదలుపెట్టారు. అయితే, వాళ్ళు ఎవర్నీ ఏమీ చేసేవాళ్ళుకాదు. ఎందుకంటే, ఎవ్వరూ వాళ్ళను అడ్డుపెట్టడానికి సాహసించలేదు గనక. అలా చాలాసార్లు బందిపోట్లు జరిగినై.

"అలా ఉండగా, ఒకసారి ఏం జరిగిందో తెలుసా, బాబూ? ఊరు ఊరూ హామూ బందిపోటు దొంగలు ఊరిబయట దిగారని హడిలిపోయాం. కాని, బందిపోటు దొంగలందరూ ఊరవతల్నే ఆగారు. వాళ్ళ నాయకుడు మాత్రం గుఱ్ఱంమీద వొచ్చాడు. మా ఊరి పెద్దను పిలిచి, అతనితో ఏదో కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోయాడు.

"మాఊరి పెద్ద గ్రామస్థుల కందరికీ తెలియజేశాడు ఆ దొంగలనాయకుడు చెప్పిన విషయాన్ని. వాళ్ళకు ధనం అక్కర్లేదుట, ధాన్యం అక్కర్లేదుట! వాళ్ళకు ఒకస్త్రీ కావాలట! వాళ్ళకోరికను నెరవేరిస్తే ఇహ వాళ్లు ఆ గ్రామాన్ని ఏమీ చెయ్యరట. లేకపోతే స్త్రీలనక, శిశువులనక అందర్నీ చించి చెండాడి గ్రామాన్ని కొల్లగొడతామని దొంగల నాయకుడు బెదిరించాడు.

"గ్రామస్థులందరూ చేరి ఈ విషయాన్ని గురించి విచారించారు. ఎవరిని పంపటమా అని వాళ్లు యోచించారు. గ్రామంలో స్త్రీలందరూ పెళ్లయి కాపరం చేసేవాళ్ళో, పెళ్ళి కావాల్సిన కన్యలో. ఇందులో ఎవర్ని పంపగలరు గనకా? అయితే, మా గ్రామంలో ఒక వితంతువు ఉండేది. ఆమె సుమారైన అందగత్తె. ఆమెకు పదేళ్లకొడుకు మాత్రం ఉండేవాడు. ఇహ, ఆ వితంతువునే దొంగలకు సమర్పించాలని అందరూ తీర్మానించారు.

"ఊరి పెద్దా అతని వెనకాల గ్రామస్థులూ ఆవిడ ఇంటికి వెళ్ళారు. జరిగిన సమాచారాన్నీ జరగాల్సిన కర్తవ్యాన్నీ వాళ్ళు వివరించారు. ఆ పడుచు ఆ ఘాతుక కార్యానికి వొప్పుకో లేకపోయింది. ఊఁ హూఁ. ఆవిడ వొప్పుకో లేదు.

"అయినా తప్పింది కాదు. ఆ వితంతువు తన శరీరసౌందర్యాన్ని ఆ కిరాతకుల వాత పెట్టాల్సిందే! తన శీలాన్ని గ్రామక్షేమానికి బలి ఇవ్వాల్సిందే. ఇహ ఆవిడకు స్వాతంత్ర్యం లేదు. తన ఇష్టం వొచ్చినట్లు ఆవిడ చెయ్యడానికి ఆమె స్వతంత్ర కాదు, గ్రామం తీర్పుకు ఆమె బానిస.

"మర్నాడు పొద్దున్నే ఆ బందిపోటు దొంగల మూకలోంచి ఇద్దరు తయారయినారు. ఆ పడుచు వితంతువు వాళ్ళిద్దరిమధ్యా నడిచి, తను శీలవతిగా తలెత్తుకు నడిచిన వీథుల్లో గ్రామానికోసం శీలాన్ని సమర్పించబోతున్న త్యాగిలాగా నడవాల్సి వొచ్చింది. ఊరి పెద్దా విచారించాడు. గ్రామస్థులూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. అమ్మలక్కలూ బావురుమన్నారు. అయినా అది అంతే!

"మూడునాళ్లు గడిచినై. లోతుకుపోయిన కళ్లతోటీ, పాలిపోయిన మొహంతోటీ, నలిగిపోయిన దుస్తులతోటీ, చిక్కిపోయిన దేహంతోటీ నిస్త్రాణగా, నీరసంగా నిరపరాధిలాగా మళ్ళీ పడుతూ లేస్తూ ఆ పడుచు గ్రామాన్ని ప్రవేశించింది. గ్రామస్థులందరూ ఆవిణ్ణి అసహ్యంతో చూశారు. ఆవిడ మీద నిప్పులు చెరిగారు. కారాలూ మిరియాలూ నూరారు. రాళ్లు రువ్వారు. కర్రలు పట్టుకొచ్చారు. కత్తులు దూశారు. "దాన్ని చంపండి! దాన్ని చంపండి! అదికులట! నీచురాలు! మానహీన! ఛండాల!" అన్నారు. ఇంకా ఇంకా ఏమేమో అన్నారు. ఆమెకు దెబ్బలు తగిలి రక్తం కారింది. సగం చినిగిన లుంగీమీద రక్తం చారలు. ఆవిడ ఏం చెయ్యగలదు పాపం ఆ ఊరా ఆ ఊరా పడిపోయింది" అని నిట్టూర్చింది మాఖిన్.

కోనిన్ కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. "అయితే ఆ విధవ పడుచును గ్రామంకోసం ఉపయోగించుకుని మళ్ళీ ఆమెను గ్రామంలోకి రానివ్వలేదన్నమాట? ఆవిడే గనక పోకపోతే గ్రామం ఏమై ఉండును? ఇదేం న్యాయం? మహాత్యాగిని కులట అని దూషించటమా?"

అని అతనూ వాపోయాడు.

"ఔను. నాయనా ఔను. లోకం తీరు అదే!" అంది మాఖిన్ తల ఊపుతూ.

"అయితే ఆవిడేమైంది? ఆవిడ కొడుకు ఏమైనాడు?"

"ఆమె మళ్ళీ పదేళ్ళ తర్వాత ఆ గ్రామానికి వెళ్ళింది. కానీ ఎవ్వరూ ఈమె మన గ్రామాన్ని ఒకసారి రక్షించిన త్యాగి అని గుర్తించలేదు. తన కొడుకు సంగతి వాకబు చేసింది. అతను రంగూన్‌లో వ్యాపారం చేస్తున్నాడనీ, ఈ పదేళ్ళలో కష్టపడి వృద్ధిలోకి వచ్చి బాగా బ్రతుకుతున్నాడనీ తెలిసింది. ఆమె రంగూన్ వెళ్ళి కొడుకును చూట్టానికి భిక్షాటనం ప్రారంభించింది. కొడుకును చివరికి తను గుర్తు పట్టకలిగింది. కొడుకు ఒక నిమిషం గుర్తించినట్టు చూశాడు. కాని అతను గుర్తుపట్టలేదు. అందుకని ఆమె చింతించనూలేదు. ఎక్కడో ఒక చోట తన తండ్రి బావుంటే సరి" మాఖిన్ కళ్ళలో నీళ్ళు నిండటం రోనిన్ చూశాడు. అతనికి అర్థం కాలేదు. ఆవిడ ఇహ కథ చెప్పలేక ఆపేసింది.

"అయితే, ఆ మహాత్యాగి ఏమైందో పాపం?" రోనిన్ ప్రశ్నించాడు కుతూహలంగా.

"ఏ మూలన బతుకుతూందో, అదంతా మీ కెందుకు బాబూ?" అని కళ్ళు తుడుచుకుంది లుంగీ చివరతో.

"మాఖిన్, ఆమె సంగతి నీకు బాగా తెలుసు. చెప్పవూ ఆమె ఎక్కడుందో?"

"ధాకిన్, మీరు ఎవ్వరికీ చెప్పననీ, రహస్యంగా ఉంచుతాననీ ప్రమాణం చేస్తే చెబుతాను."

"అచ్ఛే. నేనెవ్వరితోనూ చెప్పను."

"ధాకిన్. ఆమె నీ ఎదటే కూచునివుంది." అని మాఖిన్ బావురుమంది. రోనిన్ దిగ్భ్రాంతుడయ్యాడు.

(ఇంగ్లీషు కథ చదివి)

అధికోత్పత్తికి కావలసింది

# పరిమాణం కాదు, ప్రత్యేకత!

"విశ్వామిత్ర"

ఆ నాడు పెద్ద మీటింగు జరిగింది. ఆ చిన్న పల్లెటూరికి, ఆ జిల్లా వ్యవసాయాధికారి, ఇంకా కొందరు పేరుగల నాయకులు రావటానికి కారణం వీరయ్య తన పొలాన్ని అసామాన్యంగా పండించటమే. ఎకరానికి డెబ్భై బస్తాలు!

జిల్లా వ్యవసాయాధికారి ప్రసంగిస్తూ వీరయ్య కృషిని ప్రశంసించి, ప్రతిరైతూ ఈ విధంగా కృషిచేయాలనీ, వీరయ్యని మార్గదర్శకుడుగా ఆదర్శ ప్రాయుడుగా తీసుకోవాలనీ చెప్పి, వీరయ్య పండించింది నాలుగెకరాలే అయినా, గమనించవలసింది అతని శ్రద్ధా, ఆసక్తీ అనీ; ప్రతిరైతూ ఏభై ఎకరాలూ, వంద ఎకరాలూ సాగుచేయటం ప్రధానం కాదు, చేసినదాంట్లో ప్రత్యేకత వుండాలనీ... ఇంకాఇంకా చాలా చెప్పి వీరయ్యకి పూలమాలలు వేసి దేశభక్తుణ్ణి చేసి, బహూకరించి మిగతా రైతుల్లో ప్రోత్సాహాన్ని రెచ్చగొట్టాడు.

ప్రతిరైతూ ఆ ఏడు బహూకరణ తనకి జరగక పోయినందుకు విచారించి వొచ్చే సంవత్సరానికైనా తనా బహుమతిని అందుకొని, అధికారుల, నాయకుల మన్ననలని పొందాలని ఆరాట పడ్డాడు.

తర్వాత సంవత్సరం రైతులందరూ రాత్రింబగళ్ళూ పనిచేసి, ఎంతో డబ్బు కర్చుపెట్టి ఎరువులూ అవీ, వేయించి నానాశ్రమ పడ్డారు.

మొత్తం మీద నిరుటికన్నా అందరి పొలాలూ మెరుగే అయినా, ప్రతివాడికీ మనసులో పీకుతూనే వుంది, ఇంత శ్రమా పడితే ఆ సన్మానం తనకి దక్కుతుందో లేదోనని.